క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు రాచాల విద్యార్థిని


విద్యార్థిని కావేరి

అడ్డాకుల: మండలంలోని రాచాల ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని జి.కావేరి రాష్ట్రస్థాయి అండర్–17 ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 4న వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురంలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జోనల్ టోర్నీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 13నుంచి 15 వరకు వనపర్తి జిల్లాలోని సోళీపూర్‌లో నిర్వహించే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. కాగా విద్యార్థిని కావేరి ఎంపికపై హెచ్‌ఎం ఫయాజుద్దీన్, ఉపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, ప్రమీల, బసవరాజు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్థరైటిస్‌పై అవగాహన ర్యాలీ

పాలమూరు: ఆర్థరైటిస్ డే సందర్భంగా గురువారం ఎస్వీఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికోలతో పాటు నర్సింగ్ కళాశాల విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించి అవగాహన కల్పించారు. అనంతరం ఆస్పత్రి ఎండీ డాక్టర్ కేజే రెడ్డి మాట్లాడుతూ ఆర్థరైటిస్‌డేను పురస్కరించుకొని ఈనెల 12న ఉమ్మడి జిల్లాలోని పేదలకు ఉచితంగా పలు పరీక్షలు నిర్వహించడంతో పాటు సర్జరీలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాంరెడ్డి పాల్గొన్నారు.

నేడు మంత్రి రాక

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి, కన్మనూర్ గ్రామాలకు శుక్రవారం వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రానున్నట్లు బీఆర్‌ఎస్ పెద్దమందడి మండల అధ్యక్షుడు వేణుయాదవ్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణాలను మంత్రి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

బాధితుడికి పరామర్శ

అడ్డాకుల: మండలంలోని పెద్దమునుగల్‌చేడ్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు వెంకట్రాములు సాగర్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ ఎస్.రాజశేఖర్‌రెడ్డి గురువారం అతడిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీటీసీ చంద్రయ్య, శ్రీరాములు, చంద్రమోహన్‌రెడ్డి, రాజు, చెన్నయ్య ఉన్నారు.

ఎన్‌బీసీపీ జిల్లా అధ్యక్షుడిగా రాజు

జడ్చర్ల టౌన్: జాతీయ వెనుకబడిన తరగతుల సంఘం (ఎన్‌బీసీపీ) జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కుమ్మరి రాజును నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో గురువారం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ నియామక పత్రం అందజేశారు. వెనుకబడిన తరగతుల వారి సంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని కుమ్మరి రాజు తెలిపారు.

23శాతం ఐఆర్ ప్రకటించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రభుత్వం వెంటనే 23శాతం ఐఆర్ ప్రకటించాలని ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ కోరారు. రెండో పీఆర్‌సీలో కేవలం 5శాతం ఐఆర్ ప్రకటించడంపై గురువారం ఉద్యోగ, ఉపాధ్యాయులు మధ్యాహ్నభోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగులకు ప్రభుత్వం మాయమాటలు చెబుతూ ఆర్థికంగా నష్టం చేస్తుందన్నారు. మొదటి పీఆర్‌సీలో మధ్యంతర భృతి ఇవ్వలేదని, ఇప్పుడు కేవలం 5శాతం ఇవ్వడం సమంజసం కాదని తెలిపారు.

నేడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

నవాబుపేట/గండేడ్/దేవరకద్ర/జడ్చర్లటౌన్: నవాబుపేట మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు గురువారం ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంతోపాటు రుక్కంపల్లి, యన్మన్‌గండ్ల, జంగమయ్యపల్లి, ఊరంచుతండా, కూచూర్, పుట్టోనిపల్లితండా, లోకిరేవు, అమ్మాపూర్, కాకర్లపహాడ్, కొల్లూర్ ఎమ్మెల్యే పర్యటిస్తారని పేర్కొన్నారు.

■ ఉమ్మడి గండేడ్ మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి పర్యటించి బతుకమ్మ చీరలు పంపిణీ చేయడంతోపాటు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి తెలిపారు.

■ దేవరకద్ర బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం పంపిణీ పథకాన్ని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభిస్తారని ఎంపీపీ రమాదేవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి తెలిపారు. అదేవిధంగా వెంకటాయపల్లిలో డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి, బస్వాపూర్, నార్లోనికుంట్లలో బీటీరోడ్లు, గోప్లాపూర్‌లో చెక్‌డ్యాం నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.

■ జడ్చర్ల మండలంలోని కోడ్గల్ జెడ్పీ హైస్కూల్‌లో అల్పాహార పథకాన్ని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రారంభించనున్నట్లు ఎంఈఓ మంజులాదేవి తెలిపారు.

అన్ని పండుగలకు సమప్రాధాన్యం


మిడ్జిల్ మండలం మున్ననూర్‌లో..


భూత్పూర్ మండలం పోతులమడుగులో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

భూత్పూర్: ప్రభుత్వం అన్ని పండుగలకు సమప్రాధాన్యం ఇస్తోందని మత్స్యసహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మనిమోని సత్యనారాయణ అన్నారు. మండలంలోని పోతులమడుగులో గురువారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు సంతోషంగా పండుగ జరుపుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి ఏడాది చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కమలమ్మ, ఎంపీటీసీ ఊశన్న, మాజీ ఎంపీటీసీ రమేష్ చందర్, కార్యదర్శి వెంకటయ్యగౌడ్, మహిళా సంఘం అధ్యక్షురాలు పి.రవళి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండలంలోని వాడ్యాల్, వేముల, రాణిపేట, మున్ననూర్ గ్రామాల్లో ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ శశిరేఖ మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చాక బతుకమ్మ పండుగకు గుర్తింపు వచ్చిందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు మంగమ్మ, జంగయ్య, జంగారెడ్డి, నిరంజన్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాండుయాదవ్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌దే గెలుపు

ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


కోడూర్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: అన్ని వర్గాల అభ్యున్నతి, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్‌ఎస్ వచ్చే ఎన్నికల్లోనూ గెలిచి చరిత్ర సృష్టిస్తుందని ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని ధర్మాపూర్‌లో గురువారం రూ.23.50 లక్షలతో బీటీరోడ్డు, నర్సాపూర్‌లో రూ.12 లక్షలతో మహిళా సమాఖ్య భవనం, రూ.9 లక్షలతో సీసీరోడ్డు, రూ.15 లక్షలతో పాండురంగస్వామి ఆలయ కల్యాణమండపం, రూ.10లక్షలతో కమ్యూనిటీహాల్ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. చౌదర్‌పల్లిలో రూ.1.63 కోట్లతో నిర్మించిన 32 డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు. కోడూర్‌లో రూ.49.15 లక్షలతో నిర్మించిన ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. అదేవిధంగా ధర్మాపూర్‌కు చెందిన బీజేపీ నాయకులు 50మంది మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా, గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, జెడ్పీటీసీ వెంకటేశ్వరమ్మ, వైస్‌ఎంపీపీ కె.అనిత, ముడా డైరెక్టర్ ఆంజనేయులు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అల్లావుద్దీన్, సర్పంచ్ శంకరమ్మ, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, నాయకులు పి.రవీందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, రాఘవేందర్‌గౌడ్, యాదయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అందరి ఆదరణతోనే అభివృద్ధి సాధ్యమైందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో వృద్ధులను శాలువాతో సత్కరించి మెమోంటో అందజేశారు. జెడ్పీ సీఈఓ జ్యోతి, సాయిలు, బాల్‌కిషన్, రాజసింహుడు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వివిధ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపనలు చేశారు. 11వ వార్డు మెయిన్ రోడ్డు నుంచి మైనార్టీ గురుకులం వరకు రూ.46లక్షలతో నిర్మించే బీటీ పనులకు భూమిపూజ చేశారు. ఒకటోవార్డు మౌలాలిగుట్ట వద్ద రూ.కోటితో జాంగ్ర సంఘం కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. 10వ వార్డు ఆదర్శనగర్‌కాలనీలో రూ.10లక్షలతో అంధుల కమ్యూనిటీహాల్, క్రిస్టియన్‌పల్లిలో రూ.10లక్షలతో స్వకులశాలి కమ్యూనిటీహాల్‌కు శంకుస్థాపన చేశారు. ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్ శ్రీనివాసులు, శ్రీరామ జయరామ సంస్థల ఎండీ బెక్కరి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన అప్‌గ్రేడెడ్ ఆర్థో ఓటీ కాంప్లెక్స్, మార్చురీ నిరీక్షణ గదిని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ జీవన్, ఆర్థోవిభాగం హెచ్‌వోడీ రామకిషన్, ముడా చైర్మన్ వెంకన్న పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రావీణ్యం పెంచుకోవాలి


స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

అడ్డాకుల: గ్రామీణ యువత క్రీడల్లో ప్రావీణ్యం పెంచుకొని రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎస్.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేయడంతోపాటు స్పోర్ట్స్ కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ జితేందర్‌రెడ్డి, ఎంపీడీఓ మంజుల, ఎంపీఓ శ్రీదేవి, సూపరింటెండెంట్ శివప్రసాద్ పాల్గొన్నారు.

భూత్పూర్: గ్రామీణ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో కలిసి స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం స్పోర్ట్స్ కిట్లను సరఫరా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ నరేష్‌గౌడ్, నారాయణగౌడ్, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, మురళీధర్‌గౌడ్, ఎంపీడీవో మున్ని పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడు రోజుల జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: ఇటీవల ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వాహనదారులను గురువారం జిల్లా ఎక్సైజ్ కోర్టులో హాజరుపరిచారు. మొత్తం 9మందిని కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి డి.నిర్మల ఓ వాహనదారుడికి ఏడు రోజుల జైలుశిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధించారు. అదే విధంగా మరో ముగ్గురికి రూ.7,500, ఐదుగురికి రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. జైలుశిక్ష పడిన వాహనదారుడిని జిల్లా జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరికి పోలీసు ఉద్యోగాలు

అడ్డాకుల: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీకి చెందిన ఇద్దరు పోలీసు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబాలకు చెందిన కనగళ్ల సునీత, సిద్ధార్థ పోలీసు ఉద్యోగాలకు ఎంపిక కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సునీత భర్త సాయన్న ప్రైవేటులో పనిచేస్తూ భార్యను పోలీసు ఉద్యోగానికి సిద్ధం చేయించారు. మరో కుటుంబానికి చెందిన ఏయమ్మ కూలీ పనులు చేస్తూ తన కుమారుడు సిద్ధార్థను చదివించడంతో ఉద్యోగం సాధించాడు.

రూ.42,670 రికవరీకి ఆదేశం


సామాజిక తనిఖీ ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

నవాబుపేట: ఉపాధి హామీ పథకం పనుల్లో పక్కదారి పట్టిన రూ.42,670 నిధుల రికవరీకి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ జకియా సుల్తానా, డీఆర్డీఓ యాదయ్య సమక్షంలో గ్రామాల వారీగా చేపట్టిన పనులు, నిధుల వివరాలను వెల్లడించారు. మొత్తం 54 గ్రామాల్లో 2,222 పనులు చేపట్టగా, రూ.11కోట్ల 57లక్షలు ఖర్చు చేశారు. వీటిలో రూ.42,670 పక్కదారి పట్టినట్లు గుర్తించి, రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనంతయ్య, ఎంపీడీఓ శ్రీలత, ఏపీఓ జ్యోతి పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ పాలకమండలి ఏర్పాటు


ఆలయ చైర్మన్, ధర్మకర్తలను సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు


భూత్పూర్: మండలంలోని పోతులమడుగు వేణుగోపాలస్వామి ఆలయ నూతన పాలక మండలిని గురువారం ఏర్పాటు చేసినట్లు దేవాదాయశాఖ అధికారిణి ఎం.వీణ తెలిపారు. చైర్మన్‌గా మనిమోని సత్యనారాయణ, ధర్మకర్తలుగా పోలీస్ చల్లా వెంకట్‌రెడ్డి, ముడావత్ రమేష్ చందర్, కమ్మరి జయశంకరాచారి, సాకలి సత్యమ్మ, సత్తయ్యలను ఏక్రగీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎం.నర్సింహులు, సర్పంచ్ కమలమ్మ, ఎంపీటీసీ ఊశయ్య, కార్యదర్శి కె.వెంకటయ్యగౌడ్, పూజారి విజయ్‌శర్మ పాల్గొన్నారు.


విద్యార్థినుల ప్రతిభ


బహుమతి అందుకుంటున్న గురుకుల విద్యార్థినులు

భూత్పూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో స్థానిక మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల గురుకుల విద్యార్థినులు ప్రతిభ కనబర్చినట్లు ప్రత్యేకాధికారి బస్వరాజ్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకులాల విద్యార్థినులకు వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించగా, పాఠశాలకు చెందిన 27మంది విద్యార్థినులు ప్రతిభ కనబర్చి రెండో స్థానంలో నిలిచినట్లు చెప్పారు. విద్యార్థినులను ప్రత్యేకాధికారితోపాటు పీఈటీ మానిక, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇప్పటూరు.. అభివృద్ధి జోరు


ఇప్పుటూర్ గ్రామ వ్యూ



గ్రామంలో నిర్మించిన సీసీరోడ్డు

- ఎమ్మెల్యే దత్తత గ్రామానికి పెద్దపీట
- రూ.7.5 కోట్లతో అభివృద్ధి పనులు

నవాబుపేట: మండలంలోని ఇప్పటూర్ గ్రామ రూపురేఖలు మారిపోయాయి. ఒకప్పుడు బురద రోడ్లు, ఇరుకు సందులు, మురుగు నిల్వలతో కనిపించిన గ్రామం.. ఇప్పుడు అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గ్రామాన్ని దత్తత తీసుకోవడంతో అన్నివిధాలా ప్రగతి సాధిస్తోంది. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీరోడ్ల నిర్మాణంతో సుందరంగా మారింది. ప్రజలకు మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయి. పల్లె ప్రగతి పనులతోపాటు అదనంగా సుమారు రూ.7.5కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారు. మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇప్పటూర్.. అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

- రూ.1.5 కోట్లతో గోవానిపల్లికి బీటీరోడ్డు
- రూ.1.95కోట్లతో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు
- రూ.55లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ
- రూ.75లక్షలతో సీసీరోడ్లు
- రూ.10లక్షలతో పీహెచ్‌సీ ఆధునీకరణ
- రూ.15లక్షలతో కమ్యూనిటీహాల్స్
- రూ.50లక్షలతో పాఠశాల అభివృద్ధి
- రూ.35లక్షలతో పంచాయతీ భవన నిర్మాణం
- (మరికొన్ని అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి)


ఇంత అభివృద్ధి చేస్తామనుకోలేదు..



గ్రామాన్ని ఇంత పెద్ద మొత్తంలో అభివృద్ధి చేస్తామని కలలో కూడా అనుకోలేదు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సహకారంతో పల్లెప్రగతి పనులతోపాటు అదనంగా రూ.7.50 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాం. గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లో విద్యుత్ లోటఓల్టేజీ సమస్య పరిష్కారానికి 33/11 సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. రూ.35లక్షలతో పాఠశాలను తీర్చిదిద్దారు.

– గౌసియాబేగం, సర్పంచ్, ఇప్పటూర్

డ్రెయినేజీ సమస్య తీరింది..



గ్రామంలో డ్రెయినేజీ సమస్య తీరింది. గతంలో ఎక్కడ చూసినా మురుగునీటి కంపు ఉండేది. సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీల నిర్మాణంతో పాటు గ్రామస్తులకు మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయి. మారుమూల గ్రామానికి రూ.6కోట్లకు పైగా నిధులు వెచ్చించడం గొప్ప విషయం. ఎమ్మెల్యే కృషిని గ్రామం ఎప్పుడు మరవదు.

– నవనీత్‌రావు, ఇప్పటూర్

ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

బాలానగర్: మండలంలో గురువారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. ఉడిత్యాల, పెద్దాయిపల్లి, బోడజానంపేట, మోతీఘనపూర్, నూరారం, వీరన్నపల్లి, తండా, నేరళ్లపల్లి తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. బోడజానంపేటలో వైకుంఠధామం నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. మోతీఘనపూర్‌లో గొర్రెల యూనిట్ల పంపిణీపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గిరిజన కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ కమల, నాయకులు వేణుగోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

మిడ్జిల్: మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ సుదర్శన్ అన్నారు. మండల కేంద్రంలోని నల్లచెరువులో గురువారం 60వేల చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను సరఫరా చేయడంతోపాటు చేపల విక్రయానికి సబ్సిడీపై వాహనాలు అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, గోపాల్, జంగిలయ్య, శ్రీను, కృష్ణయ్య పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: మండలంలోని నసురుల్లాబాద్ పెద్ద చెరువులో గురువారం సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్‌చందర్ చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో రైతు సంఘం కన్వీనర్ రఘునందన్, మున్వర్, నిజాం, రాఘవేందర్, కురుమూర్తి, రాములు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయండి

భూత్పూర్: ఈనెల 7న జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నుంచి చేపట్టనున్న విశ్వరూప పాదయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కాన్షీరాం కోరారు. గురువారం పట్టణంలోని చౌరస్తాలో విశ్వరూప పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్నా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ రాచూరి వెంకటేష్, ఎంపీటీసీ ఊశన్న, హన్మంతు, లక్ష్మణ్, రాములు, వీరస్వామి, లక్ష్మణ్, బాలు, కృష్ణమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేటర్లకు పేస్కేల్ ఇచ్చేదాక పోరాటం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తమకు పేస్కేల్ అమలు చేసేదాక పోరాటం సాగిస్తామని తెలంగాణ ఈ పంచాయతీ టెక్నికల్ వింగ్ నాయకులు స్పష్టం చేశారు. పంచాయతీశాఖలో పని చేస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, పంచాయతీ ఆపరేటర్లకు పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ధర్నా చౌక్‌లో చేపట్టిన నిరసన దీక్ష గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ నవీద్ మాట్లాడుతూ ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్లకు పేస్కేల్ అమలు చేయడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. వీరి ధర్నాకు ఏపీఓ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, రవి మద్దతు తెలిపారు. కిశోర్, నయూం పాల్గొన్నారు.

గ్రామ సభల్లోనే లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలి

చిన్నచింతకుంట: గ్రామ సభల్లోనే సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు డిమాండ్ చేశాడు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పథకాల అమలులో విఫలమైందన్నారు. గృహలక్ష్మి, దళితబంధు, బీసీబంధు, మైనార్టీబంధు పథకాలకు సంబంధించి అర్హుల ఎంపికలో పేదలకు అన్యాయం చేస్తోందన్నారు. లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుర్వ రమేష్, మండల అధ్యక్షుడు దశరథ్, రాములు, ఎర్ర వెంకటన్న, నరేందర్‌జీ, నరేష్ పాల్గొన్నారు.

ఎస్టీఓకు సన్మానం

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా ప్రారంభించిన సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఎస్టీఓగా బాధ్యతలు చేపట్టిన బాలగోపాలాచారిని గురువారం తెలంగాణ జీహెచ్‌ఎంల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు అబ్దుల్‌హక్, రామలింగం, సుమన్ మహారాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.